www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 4 డిసెంబర్ 2022
5
చిత్తూరు



నేడు తిరుమలకు రానున్న రాష్ట్రపతి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఈనెల 4, 5 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల, తిరుపతిలో పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్పి పరమేశ్వరరెడ్డిలు బందోబస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం రాత్రి 9.25 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి వచ్చి రాష్ట్రపతి తిరుమలలో రాత్రి బస చేయనున్నారు. సోమవారం ఉదయం 9.25 గంటలకు వరాహస్వామి, తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. 11.35 గంటలకు అలిపిరి వద్ద గోమందిరాన్ని సందర్శిస్తారు. 11.55 గంటలకు శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.50 గంటలకు బయల్దేరి తిరుచానూరు అమ్మవారిని దర్శించుకుంటారు. 1.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు. రాష్ట్రపతి మొదటిసారిగా తిరుపతి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ ఆదేశించారు.

ప్రసూతి మరణాలు జరగకుండా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్



రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో సమూల మార్పులు తెస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తోందని కలెక్టర్ యం. హరి నారాయణన్ తెలిపారు. శనివారం జిల్లా సచివాలయం లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలో 2022 ఏప్రిల్ నుండి 2022 నవంబర్ వరకు జరిగిన ప్రసూతి మరణాలకు సంబంధించి సంబంధిత మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎం, ఆశా, అంగన్వాడీ వర్కర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు ఎన్నో కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తోందన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ అంశం పై మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎం లు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు అందరూ సమన్వయంతో పని చేసి జిల్లాలో ప్రసూతి మరణాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రధానంగా క్షేత్ర స్థాయిలో గర్భిణీలకు అందించే వైద్య సేవల్లో ఏఎన్ఎం, ఆశా, అంగన్వాడీ వర్కర్ ప్రధాన పాత్ర పోషిస్తారని, వీరు గర్భవతుల ఆరోగ్య స్థితుల పై ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటూ వారికి అవసరమైన వైద్య సలహాలు, సూచనలు ఇవ్వాలని, వారు సుఖ ప్రసవం జరిగేలా, తల్లి, బిడ్డ క్షేమంగా ఇంటికి చేరుకునేంత వరకు వారికి పూర్తి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. గర్భవతులుగా ఉన్న సమయంలో వారికి అవసరమైన పౌష్టికాహారం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించడంతో పాటు రక్త హీనత లేకుండా సుఖ ప్రసవం జరిగేలా తీసుకోవలసిన జాగ్రత్తల పై తగు అవగాహనను ఏ ఎన్ ఎం లు కల్పించాలని, అందుకు అవసరమైన మందులను అందజేయాలని తెలిపారు. హైరిస్క్ గర్భవతుల పై మరింత శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య సేవల నిమిత్తం వచ్చే గర్భవతులకు ప్రసవ సమయంలో ఇబ్బందికర పరిస్థితులు ఎదరైనప్పుడు మెరుగైన వైద్య సేవల కొరకు సరియైన వైద్యశాలకు వెంటనే సిఫారసు చేసి పంపాలని తద్వారా తల్లి, బిడ్డ ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో మెటర్నల్ మోర్టాలిటి రేషియో (ఎంఎంఆర్) 35.5గా కలదని, ఇన్ఫాంట్ మోర్టాలిటి రేట్ 7.5 గా కలదని, డి సి హెచ్ ఎస్ డా. నాయక్ కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశం లో డి ఐ ఓ డా. రవి రాజు, సంబంధిత మెడికల్ ఆఫీసర్ లు పాల్గొనగా, ప్రసూతి మరణాలకు సంబంధించిన వివరాలను కేసుల వారీగా జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

సర్వేలో తప్పుల తడకలు

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

ప్రజాదృష్టి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకం అనుకొని చేపట్టిన సర్వే మొత్తం తప్పులుతడకలుగా తయారైంది. రైతులకు మంజూరు చేసిన పత్రాల్లో ఎక్కువగా తప్పులుండడం వల్ల వారు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం చేసిన ప్రచార హంగుకు తగ్గట్టుగా ఇందులో పనితనం లోపించింది. అన్ని జాగ్రత్తలూ తీసుకోకుండా విడుదల చేయడం వల్ల భారీ ఎత్తున తప్పులు దొర్లుతున్నాయి. సమగ్ర భూ సర్వే పేరుతో ప్రభుత్వం జగనన్న భూ హక్కు భూ రక్ష కార్యక్రమాన్ని నిర్వహించింది. అయితే ఇది తొలి రోజే అభాసుపాలైంది. పంపిణీ చేసిన కొద్ది సేపటికే రైతులు తమ పొలాలకు సంబంధించిన లెక్కల్లో తేడాలుండాయని ఫిర్యాదులు చేశారు. ఎక్కువ విస్తీర్ణం నమోదవుతోందనే వార్తలు కూడా వచ్చాయి. దీంతో అధికారులు కూడా తలలు పట్టుకున్నారు. దీనిపై అనేక పత్రికల్లో వార్తలు కూడా గుప్పుమన్నాయి. ప్రభుత్వం ఎలాగైనా ప్రచారం చేసుకోవాలనే హడావుడితో అసలుకే మోసం అయినట్లు అయ్యింది. తొలుత ఆయా మండలాల్లో అధికారులు ఈ రికార్డులను అంతటినీ విభజించారు. ఇది పూర్తయిన తరువాత రీ సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని డిసెంబర్ 23 నాటికి పూర్తిచేయాలని చెప్పడంతో అధికారుల్లో హైరానా నెలకుంది. ఉన్నతాధికారులు రెవెన్యూ సిబ్బందిపై ఒత్తిడి పెంచారు. ఈ హడావుడి వల్ల అసలుకే మోసం వచ్చినట్లుగా అయ్యింది. భూ హక్కు పత్రాలు ఇచ్చిన కొన్ని గ్రామాల్లో రికార్డుల్లో తప్పులు దొర్లాయి. కొన్ని ప్రాంతాల్లో 10 నుంచి 20 సెంట్లు తక్కువగా వచ్చాయి. కొని ప్రాంతాల్లోని రైతులకు ఎక్కువగా భూమి ఉన్నట్లు వచ్చింది. దీనిపై రైతుల్లో హైరానా నెలకొంది. తగ్గిన పుస్తకాలను పట్టుకుని కార్యాలయం చుట్టూ పరుగులెత్తాల్సిన పరిస్థితి నెలకుంది. ఇలా అన్ని ప్రాంతాల్లోనూ ఎదురు కావడంతో అధికారులే దీనిపై డైలమాలో పడ్డారు. తీరా తేరుకుని కొత్త టెక్నాలజీతో పనులు చేయడం వల్ల ఈ సమస్యలు వచ్చాయని సంవత్సరం వరకు సమయం ఉంటుందని, రైతులు సరిదిద్దుకోవచ్చని చెప్పడంతో కాస్త వివాదం సద్దుమనిగినట్లు అయ్యింది.

రేపు రిటైర్డ్ విద్యుత్ ఎంప్లాయిస్ సర్వసభ్య సమావేశం

తిరుపతి(మంగళం): రిటైర్డ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి నగర పరిధిలోని పిఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షులు కేఎస్ఎన్ చారి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా రిటైర్డ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యకలాపాలను కొనసాగిస్తూ వస్తోందని, కరోనా తరువాత ఐదవ తేదీ 10వ వార్షికోత్సవము, సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఎటువంటి సమస్య ఉన్న అసోసియేషన్ అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 73 ఏళ్లు దాటిన వారికి సన్మానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రభాకర్ రావు, కోశాధికారి కే.రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

పుట్టిన పిల్లలకూ ఆధార్ తప్పనిసరి : జేసీ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఆధార్ అప్ డేషన్ ప్రతి 10 సంవత్సరాలకు తప్పని సరని, రాష్ట్రంలో,దేశంలో ప్రభుత్వ పథకాలకు తప్పనిసరని, పుట్టిన పిల్లలకు ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లకముందే వారికి తల్లి వేలిముద్రలు తో ఆధార్ కల్పించాలని, జిల్లాలో 229 కేంద్రాలు ఉన్నాయనీ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. ఆధార్ ఆవశ్యతపై లభ్యం గురించి జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పని సరి అని అన్నారు. అదేవిధంగా ఆధార్ లో మార్పులకు ఒకసారి మాత్రం చేసుకోవాలని కొన్ని మార్పులు ఎక్కువ సార్లు చేసుకోవాలంటే జనన ధ్రువీకరణ పత్రాలు తప్పని సరి అన్నారు. 10 సంవత్సరాల ముందు ఆధార్ తీసుకొన్నవారు అన్ని సమాచారాలు కరెక్ట్ గా వుంటే అప్ డేట్ చేసుకోవాలి. చిత్తూరు జిల్లాలో మొత్తం 45,60,606 మందికి నవంబర్ 30 నాటికి ఉన్నాయని, 628637 మందికి సంభందించిన డాక్యుమెంట్లు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు మార్పులు కోసం ఉపయోగిస్తున్న 79 కిట్లు లో ఇప్పటి వరకూ 5000 మాత్రమే చేశారని అన్నారు. మొబైల్ వాహనాల ద్వారా కూడా ఆధార్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్తో పాటు డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ , డిపిఓ లక్ష్మి, డి ఆర్ డి ఏ పీడీ తులసి, గహనిర్మాణ శాఖ పి డీ పద్మనాభం, జిల్లా వ్యవసాయాధికారి, లీడ్ బ్యాంకు మేనేజర్ శేషగిరి రావు, ఎస్ బి డి ఎస్ పి శ్రీనివాసులు రెడ్డి లతో పాటు ఆధార్ ప్రతినిధి జావేద్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సమాన హక్కులు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్



విభిన్న ప్రతిభావంతులు నేడు అన్ని రంగాలలోనూ రాణిస్తున్నారని చిత్తూరు శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అందరితో సమానంగా వీరికి హక్కులు కల్పించాలన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ భవన్ లో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి చిత్తూరు ఎం ఎల్ ఏ పాటు చిత్తూరు నగర మేయర్ అముద, జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, జెడ్ పి వైస్ చైర్మన్ రమ్య, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవద్ధుల సంక్షేమ శాఖ ఏడి ఎ.వై. శ్రీనివాస్, బి.సి, ఎస్.సి కార్పొరేషన్ ఈడి లు సుబ్రహ్మణ్యం, నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం ఎల్ ఏ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు అంగ వైకల్యమును తుల్యముగా భావించి మనో నిబ్బరంతో అన్ని రంగాలల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల పాదయాత్రలో విభిన్న ప్రతిభావంతులు తోడుగా నడిచారని,వీరి అభిమానాన్ని మరచి పోరని, వీరి అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నదన్నారు. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తరువాత మూడున్నర సంవత్సరాల కాలంలో విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన అన్ని రకాల సేవలను అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల దష్టికి తీసుకెళ్ళి కమ్యూనిటీ హాల్ ను ఏర్పాటు చేయడానికి కషి చేస్తామని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు కార్య సాధన యందు దఢ సంకల్పంతో ఉంటారని తెలిపారు. వీరి అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ప్రతి నెలా ఒకటవ తేదినే సామాజిక పించన్ అందిస్తున్నామన్నారు.

జిల్లాలో సాధారణ విభిన్న ప్రతిభావంతులకు నెలకు రూ.3000 చొప్పున, పక్షవాతంతో బాధపడుతున్న వారికి నెలకు రూ.5వేలు, తలసేమియా, సికిల్ సెల్ వంటి వ్యాధులతో భాదపడుతున్న వారికి నెలకు రూ.10వేల చొప్పున పించన్ అందిస్తున్నామన్నారు. స్వయం ఉపాధి పథకం ద్వారా 2022-23 సం. లో 50 వేల రూపాయల నుండి 5 లక్షల రూపాయల వరకు 52 మందికి వివిధ రకాలైన ఉపాధి కొరకు మొత్తం రూ.1.07 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు గహాలను మంజూరు చేశామన్నారు. 70 శాతం శారీరక వికలత్వం కలిగిన వారికి రిట్రో ఫీటేడ్ మోటార్ వాహనాల కొరకు ప్రభుత్వ నిబంధలనలను సరళతరము చేసి రూ.12 లక్షల విలువ చేసే 10 మూడు చక్రాల మోటార్ సైకిల్ లు, రూ.1.05 లక్షల విలువ చేసే మూడు ల్యాప్ ట్యాప్ లు, రూ.45 వేలు విలువ చేసే మూడు టచ్ ఫోన్ లు, స్వయం ఉపాధి పథకం కింద 10 మందికి రూ.23 లక్షల మంజూరు పత్రాలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందించడం జరిగిందని తెలిపారు. ఇంకనూ అవసరమున్న వారికి భవిష్యత్తులో అందించే విధంగా కషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ గత మూడు సంవత్సరములలో బ్యాటరీ ట్రై సైకిల్ లు, ల్యాప్ టాప్, టచ్ ఫోన్, మూడు చక్రాల సైకిల్ లు, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు, కత్రిమ అవయవాలు సమకూర్చుటకు మొత్తం 2,080 మంది లబ్దిదారులకు రూ.2.95 కోట్లు ఖర్చు చేశామన్నారు. నగర మేయర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు అందరితో సమానంగా అన్ని హక్కులను కల్పించడం జరిగిందని తెలిపారు. వీరు విద్యారంగంలో బాగా రాణిస్తున్నారని తెలిపారు. సదరం సర్టిఫికేట్లను అందించడం జరుగుతున్నదని తెలిపారు.

జగన్ పాలనలో రాష్ట్రం అల్లకల్లోలం : బిజెపి

తిరుమల : వైకాపా నాలుగు ఏళ్లపాలనలో రాష్ట్ర అభివద్ధిని గాలికి వదిలేసిందని,రాజకీయ ప్రేరణతో వైకాపా ముందుకు సాగుతుందని భాజపా నేత విష్ణు వర్ధన్ రెడ్డి ఆరోపించారు. శనివారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం కావాల్సిన సహాయసహకారాలు అందిస్తున్న అంది పుచ్చుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను వాటాలు చెల్లించలేక రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులను మూల పడేసిందన్నారు. ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల్లో సీఐడి.ఈడి లు చుట్టాలగా వస్తున్నారన్నారు. ఢిల్లీ మద్యం కేసుల్లో కేసీఆర్ కుమార్తె కవిత పాత్ర ఉందన్నారు. పోలవరాన్ని రాజకీయ పార్టీలు ఏటీఎమ్ లాగా వాడుతున్నారని, పోలవరం ప్రాజెక్టు సంబంధించి జగన్ టెండర్లు మార్చి తప్పు చేశారని ఆయన తెలిపారు.

ఆస్తమా వ్యాధిగ్రస్తులను వికలాంగుల క్యూలైన్లలో అనుమతించండి

'డయల్ యువర్ ఈఓ' లో భక్తుని ఆవేదన

ప్రజాశక్తి - తిరుమల

ఆస్తమా వ్యాధి గ్రస్తులకు వద్దులు, దివ్యాంగుల దర్శన లైన్ ద్వారా శ్రీవారి దర్శనం కల్పించాలని భక్తులు కోరారని, దాని పై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఈవో ధర్మారెడ్డి తెలిపారు. శనివారం తిరుమల స్థానిక అన్నమయ్య భవనంలో డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఈవో ధర్మారెడ్డి భక్తులను ఉద్దేశించి మీడియాతో మాట్లాడారు. మొత్తం 33 మంది భక్తులు నేరుగా ఈఓ తో మాట్లాడారు. వద్దులు,దివ్యాంగులకు ఆలయం దగ్గరగా వసతి సదుపాయం వరాహ స్వామి అతిథి గహంలో ఏర్పాటు చేయాలని కొందరు భక్తులు కోరినట్లు తెలిపారు. లడ్డూ విక్రయాశాలకు సంభందించి అక్రమాలకు పాల్పడిన కేవీఎమ్ సంస్థ సిబ్బందిని ఇప్పటికే ఏడుగురినిపై చర్యలు తీసుకున్నామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేవీఎమ్ సంస్థ లో పనిచేస్తున్న సిబ్బందిని తిరిగి విధులలోకి తీసుకోబోమని ఆయన స్పష్టం చేశారు. నవంబర్లో శ్రీవారిని 20.77 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారన్నారు. నవంబర్లో శ్రీవారి హుండీ ఆదాయం రూ.127.31 కోట్లు కాగా నవంబర్లో కోటి 3 లక్షల లడ్డూలు భక్తులకు విక్రయాలు జరిగిందన్నారు. నవంబర్లో శ్రీవారికి తలనీలాలు 8.91 లక్షల మంది భక్తులు సమర్పించారని ఈవో తెలియజేశారు.

చిట్టీలతో ..'ఛీ'టింగ్ !

తిరిగివ్వాల్సిన సమయంలో పరార్


అధిక వడ్డీలనూ ఆశచూపి ప్రలోభాలు

ఐపిల పేరుతో రెండేళ్లలో 150 కోట్లు స్వాహా

బెంబేలెత్తుతున్న బాధితులు

- తిరుపతి తాతయ్యగుంట ప్రాంతంలో ఓ మిర్చి, చింతపండు వ్యాపారి చిట్టీల పేరుతో దందాకు తెరదీశాడు. తనకు పరిచయం ఉన్న ఓ ఎన్ఆర్ఐ భార్యను ప్రలోభపెట్టాడు. ప్రస్తుతం తిరుపతి శివారుల్లో కాపురముంటున్న ఆ కుటుంబం నుంచి ఒక్కోటి రూ. 20 లక్షల చొప్పున రెండు చిట్టీలు వేయించారు. చివరిదాకా కంతులు కట్టించుకుని తిరిగివ్వాల్సిన సమయంలో బోర్డు తిప్పేశాడు. విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ తీవ్రంగా శ్రమించి ఆ వ్యాపారిని వెదికి పట్టుకున్నా ఫలితం లేకపోయింది.
- మంగళం ప్రాంతంలో ఉంటున్న ఓ వ్యక్తి రవాణా సంస్థలో పనిచేస్తున్నాడు. అతను కోట్లాది రూపాయల చిట్టీలు నిర్వహించేవాడు. కంతులు వసూళ్లు చేయడంలో దిట్టగా పేరుగాంచాడు. ఆఖరికి కరోనా కష్టకాలంలోనూ ముక్కుపిండి మరీ వసూళ్లు చేశాడు. అయితే తిరిగి చెల్లించాల్సిన సమయం రావడంతో చేతులెత్తేశాడు. 'ఇదంతా కరోనా ఎఫెక్ట్' అంటూ కలరింగ్ ఇస్తుండటం గమనార్హం. పైగా మంగళం నుంచి మకాం మార్చి అబ్బన్న కాలనీలో ఉంటున్నట్లు సమాచారం.
- ఓ ప్రయివేట్ సంస్థలో ఏళ్ల తరబడి కంతులు చెల్లించిన ఓ మహిళ చిట్టీ డబ్బుల కోసం కాళ్లరిగేలా తిరిగింది. అయినా ఏమాత్రం స్పందించకపోగా దౌర్జన్యానికి దిగారు. దీంతో మీడియాను ఆశ్రయించింది. ప్రెస్మీట్ను ఏర్పాటు చేసింది. ఈ విషయం తెలుసుకున్న ఆ సంస్థ నిర్వాహకులు 'మీ డబ్బులు ఇచ్చేస్తాం..ప్రెస్మీట్ పెట్టొద్దు.' అంటూ కాళ్లబేరానికి వచ్చారు. ఇది జరిగి నాలుగురోజులైనా ఇప్పటికీ డబ్బులు తిరిగి చెల్లించలేదని తెలుస్తోంది.
- తిరుపతిలో పేరుమోసిన ఓ బడా స్థిరాస్తి వ్యాపారి ఐదేళ్లుగా అందరినీ నమ్మించాడు. తిరుపతి, ఏర్పేడు, తిరుచానూరు, సూళ్లూరుపేట, నాయుడుపేటలో వెంచర్లు వేశాడు. ఆయా ప్రాంతాల రాజకీయనాయకులు, వ్యాపారులతో పరిచయం పెట్టుకుని వారి నుంచి పాతిక, యాభైలక్షలు ఇలా కోట్లాది రూపాయలు వడ్డీలకు తీసుకునేవాడు. ఆఖరికి ప్లాట్లకు అడ్వాన్సులంటూ మధ్యతరగతి, ఉద్యోగ వర్గాల నుంచి రూ. 2- 10 లక్షల వరకు తీసుకున్నాడు. ఇలా నాలుగేళ్లు ఇక్కడి వారిని నమ్మబలికి భారీగా వసూలు చేసి పారిపోయి ఏడాది పైనే గడుస్తోంది. ఇతడి ఆచూకీ కోసం ప్రయత్నించినా ప్రయోజనం లేక పోలీసులను ఆశ్రయించారు. ఆయన తాజాగా ఐపి దాఖలు చేయనున్నట్లు అతని వద్ద పనిచేసిన ఉద్యోగులు చెబుతున్నారు.
- తిరుపతి సుందరయ్యనగర్లో ఉంటున్న ఓ మహిళ చిట్టీపాటల పేరుతో లక్ష, రెండు లక్షలు..ఐదు లక్షలు...ఇలా పెద్దఎత్తున చుట్టుపక్కల వారి నుంచి కోట్లరూపాయలు వసూలు చేసింది. తొలుతగా నమ్మకంగా వ్యవహరించిన ఆమె..తన కూతురు, అల్లుళ్లతోనూ చిట్టీలు నిర్వహింపజేసింది. పెద్దమొత్తంలో పోగవడంతో తాను ఆర్థికంగా దివాళాతీశానంటూ కోర్టులో ఐపి దాఖలు చేసింది. దీంతో బాధితులు పోలీసుల్ని ఆశ్రయించినా చేసేది లేక చేతులెత్తేసిన వైనం.
- చెన్నారెడ్డి కాలనీలో ఉంటున్న మరో వ్యక్తి ఓ ప్రయివేటు ఆసుపత్రి పనిచేస్తున్న ఓ మహిళ దగ్గర చిట్టీలు వేశారు. ఆ చిట్టీల సొమ్ము వడ్డీలకు అతడికే ఇచ్చారు. ఇలా రెండేళ్లు వడ్డీ సక్రమంగా చెల్లించిన సదరు వ్యక్తి ఇల్లు వదిలి పరారయ్యాడు. ఇతడు చాలామందిని ఇదే రీతిలో మోసం చేసినట్లు గ్రహించి లబోదిబోమన్నారు. ఇలా ఒకరిద్దరు కాదు..పదులు దాటి..వందల సంఖ్యలో బాధితులు ఇలాంటి కేటుగాళ్ల బారిన పడి మోసపోతుండటం గమనార్హం.

ప్రజాశక్తి- తిరుపతి



ఆధ్యాత్మిక, విద్యా, వైద్యకేంద్రంగా భాసిల్లుతున్న తిరుపతి నగరంలో ఇటీవల కేటుగాళ్లు పాగా వేశారు. వారికి పెద్ద వ్యాపారులున్నాయన్నట్లు ప్రచారం చేసి సామాన్యులను నమ్మబలికిస్తున్నారు. అధిక వడ్డీలు ఆశచూపి కొన్ని రోజులు, నెలల పాటు సక్రమంగా చెల్లిస్తూ చివరికి జెండా ఎత్తేస్తున్నారు. ఒకవేళ వారిని పోలీసులు గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేస్తే ఇన్సాల్వెన్స్ పిటిషన్ (ఐపి) దాఖలు చేస్తూ దర్జాగా తప్పించుకుంటున్నారు. ఇలా ఒకటి రెండు కాదు.. రెండు,మూడేళ్లలో దాదాపు రూ 150 కోట్లపైగా దోచుకున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల కాలంలో బయటిప్రాంతాల నుంచి తిరుపతికి వలస వస్తున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. వారిలో కొందరు హడావుడి చేసి కార్లు, పెద్దపెద్ద ఇళ్లలో అద్దెకు దిగుతున్నారు. కాంట్రాక్ట్, ఇతర వ్యాపారాల పేరిట స్థానికులను నమ్మబలికిస్తున్నారు. ఇలా వచ్చిన వారు అందిన కాడికి సొమ్ము వసూలు చేసుకుని పరారవుతున్నారు. సామాన్యులే లక్ష్యంగా చేసుకుని కొందరు మోసం చేస్తున్నారు. ఇలాంటివి ఇటీవల కాలంలో అధికమవుతున్నాయి. మరికొందరు బడాబాబులుగా చలామణి అవుతున్న వారిలో ఎక్కువ మంది బయటి వ్యక్తులే ఉంటున్నారు. వారిలో ఇతర ప్రాంతాల్లో ఇలాంటి మోసాలు చేసి ఇక్కడికి వస్తున్నారు. ఇక్కడా మోసం చేసి మరో ప్రాంతంలో తలదాచుకుంటున్నారు. సామాన్యులు కూడా అధికవడ్డీల ఆశతో వారి వలలో చిక్కుతున్నారు. వడ్డీలకు తీసిచ్చేవారికి (దళారీ) పర్సంటేజీలు ఇస్తున్నారు. నమ్మించడం, మోసం చేయడం పరిపాటిగా పెట్టుకుంటున్న వారంతా పెద్దలుగా చలామణి అవుతూ చివరినిమిషంలో కోర్టులో ఐపి దాఖలు చేస్తున్నారు. ఇలాంటి కేటుగాళ్ల పట్ల అప్రమత్తతో వ్యవహరించకుంటే కూడబెట్టుకున్న సొమ్ములంతా స్వాహాయనం అవుతుండటం గమనార్హం. ఇదే తీరుగా కొందరు స్థిరాస్తి వ్యాపారులు అధికవడ్డీల ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్నారు.

'మాదురి రెమిడీ' హాస్పిటల్‌లో..

అన్ని రకాల వైద్య సదుపాయాలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి





'మాధురి రెమిడీ' హాస్పిటల్లో అన్ని రకాల వ్యాధులకు అత్యాధునిక పరికరాలతో నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు ఆ ఆసుపత్రి అధినేత్రి డాక్టరు మాధురిగాంధి తెలిపారు. స్థానిక హరేరామ హరేకృష్ణ రోడ్డులోని మాధురి రెమిడీ హాస్పిటల్ వద్ద ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ మా ఆసుపత్రిలో 50 పడకల మల్టీస్పెషాలిటీ విభాగాలతో పాటు ట్రామా కేర్ సెంటర్ను కూడా ఏర్పాటు చేశామన్నారు. అనుభవజ్ఞులైన వైద్య సిబ్బందిచే అందరికీ నాణ్యమైన వైద్యం అందించడం తమ ప్రత్యేకత అన్నారు. ఆర్థోపెడిక్ సర్జరీ, కీళ్లమార్పిడి శస్త్ర చికిత్సలు, వెన్నెముక సర్జరీ, జనరల్ మెడిసిన్, జనరల్ అండ్ లాపరోస్కోపిక్ సర్జరీ, గర్భిణులు, గర్భకోశ వ్యాధులు, మధుమేహ వ్యాధులు, న్యూరో సర్జరీ, యూరాలజి, డెంటల్ విభాగల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. మాదురి డెంటల్ క్లీనిక్ విభాగం ద్వారా అందమైన చిరునవ్వు కోసం ఆధునిక దంత వైద్యం అందిస్తున్నామని తెలిపారు. పిప్పిపళ్లకు రూట్ కెనాల్, చిగుర్ల నుంచి రక్తం, ఎత్తుపళ్లు, పళ్ల మధ్య సందులు, వంకర పళ్లు, రంగు మారిన పళ్లు, విరిగిన పళ్లు, కృత్రిమ దంతాలు, డెంటల్ ఇంప్లాంట్స్, డెంటల్ లేజర్స్, స్మైల్ డిజైనింగ్, కాస్మోటిక్ డెంటిస్ట్రీ, జ్ఞాణ దంతం సమస్యలకు అధునూతనమైన పద్ధతిలో నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని వెల్లడించారు. డాక్టరు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, ప్రముఖ హెల్త్ ఇన్సూరెన్స్ల ద్వారా నగదు రహిత వైద్యం, ఆరోగ్యశ్రీ ద్వారా ఆర్థోపెడిక్ అండ్ పాలిట్రామా, క్రిటికల్ కేర్, జనరల్ మెడిసిన్, జనరల్ అండ్ ల్యాపరోస్కోపిక్ సర్జరీ, యురాలజీ, న్యూరో సర్జరీ విభాగాల ద్వారా వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలతో తమ ఆసుపత్రిలో తాజాగా విరియోన్ల్యాబ్ను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఆరోగ్యమస్తు హెల్త్ ప్యాకేజీల ద్వారా తక్కువ ధరలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. బేసిక్ డయాబెటిక్ ప్రొఫైల్ పేరుతో రూ.399కు, ఎఫ్బిఎస్, హెచ్బిఏ1సి, కంప్లీట్ యూరిన్ పరీక్షలు, కిడ్నీ ఫంక్షన్ పరీక్షతో పాటు సుమారు 15 వైద్య పరీక్షలు డయాబెటిక్ ప్రొఫైల్ పేరుతో రూ.599కే ఎఫ్బిఎస్, హెచ్బిఏఐసి, కిడ్నీ ఫంక్షన్ టెస్ట్, లిఫిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, కంప్లీట్ యూరిన్ పరీక్షలతో పాటు సుమారు 27 వైద్య పరీక్షలు. బేసిక్ హెల్త్ చెకప్ పేరుతో రూ.699కే షుగర్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, లిఫిడ్ ప్రొఫైల్, లివర్ ఫంక్షన్ టెస్ట్, కిడ్నీ ఫంక్షన్ టెస్ట్, థైరాయిడ్(టి3, టి4, టి5హెచ్), కంప్లీట్ యూరిన్ పరీక్షలు, డాక్టరు కన్సల్టేషన్తో పాటు సుమారు 45 రకాల వైద్య పరీక్షలు కోవిడ్ ప్రొఫైల్ పేరుతో రూ.2999కే ఆర్టి పిసిఆర్, డి.డిమెర్, ఫెర్రేట్టిన్, సిఆర్పి, ఐఎల్-6, లివర్ ఫంక్షన్ టెస్ట్, కోవిడ్ యాంటీబాడీ, విటమిన్-డి, కంప్లీట్ బ్లడ్ పిక్చర్ పరీక్షలు. ఇన్ఫెక్షన్ ప్రొఫైల్ పేరుతో రూ.299కే కంప్లీట్ బ్లడ్ పిక్చర్, హెచ్ఐవి, హెపటైటీస్-బి, సి, విడిఆర్ఎల్ వైద్య పరీక్షలు. టోటల్ బాడీ చెకప్ పేరుతో రూ.1599కే షుగర్ టెస్ట్, హెచ్బిఏఐసి, థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్, లివర్ ఫంక్షన్ టెస్ట్, కిడ్నీ ఫంక్షన్ టెస్ట్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, కంప్లీట్ యూరిన్ పరీక్షలు, సీరం కాల్షియం, సీరం ఎలక్ట్రీస్, ఈసిజి, చెస్ట్ ఎక్స్రే, డాక్టరు కన్సల్టేషన్తో పాటు సుమారు 63 వైద్య పరీక్షలు. ప్యాకేజీ ఉమెన్ పేరుతో రూ.1599కే లిపిడ్ ప్రొఫైల్, షుగర్ టెస్ట్, ఈఎస్ఆర్, విటమిన్-డి, కాల్షియం, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, లివర్ ఫంక్షన్ టెస్ట్, కిడ్నీ ఫంక్షన్ టెస్ట్, కంప్లీట్ యూరిన్ పరీక్షలు, థైరాయిడ్, హార్మోన్స్ (ఎఫ్ఎస్హెచ్) వైద్య పరీక్షలు. ఫీవర్ ప్రొఫైల్ పేరుతో రూ.999కే కంప్లీట్ బ్లడ్ షుగర్, డెంగ్యూ, వైడల్ టెస్ట్ (టైపాయిడ్), సిఆర్పి, కంప్లీట్ యూరిన్ టెస్ట్, మలేరియా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫ్రీ హోమ్ కలక్షన్ కూడా అందుబాటులో ఉంచామన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 0877 223004, 73370 01143 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు

-24 గంటలు యాక్సిడెంట్, ఎర్జన్సీ సర్వీసులు.
-24 గంటలు మెడికల్ అండ్ సర్జికల్, ఐసియు సదుపాయం.
-24 గంటలు ఫార్మసీ, క్లినికల్ లేబరేటరీ, ఫుజి డిజిటల్ ఎక్స్రే.
-లామిన్ ఫ్లో కలిగియున్న ఆదునాతనమైన రెండు ఆపరేషన్ థియేటర్లు.
-సి-ఆర్మ్, వెంటిలేటర్, ఇసిజి.
-ఫిజియోథెరపి, ఒబెసిటి క్లీనిక్.
-నొప్పిలేకుండా సాధారణ కాన్పు, సంతానం లేని వారికి చికిత్స.



యాజమాన్య పద్ధతులతోనే దిగుబడులు



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మామిడి సాగు రైతులు యాజమాన్య పద్ధతులతో పాటు సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని శాస్త్రవేత్త సుందర్ రాజ్ అన్నారు. శనివారం ఏరిస్ కంపెనీ భాగస్వామ్యంతో గంగాధర నెల్లూరు మండలం రామానాయుడుపల్లె వద్ద ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మామిడి ఉత్పత్తిలో చిత్తూరు జిల్లాకు అధిక ప్రాధాన్యత ఉందని, అయితే సస్యరక్షణ పద్ధతులు సక్రమంగా పాటించకపోతే నాణ్యమైన పంట దిగుబడి సాధ్యం కాదన్నారు. మామిడి సీజన్లో రైతులకు ఎదురయ్యే వివిధ రకాల చీడపీడల నివారణ కోసం రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. కార్యక్రమంలో ఏరిస్ కంపెనీ రీజనల్ మేనేజర్ మాధవ్, జోనల్ మేనేజర్ రత్తయ్య, శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీ అధినేత తిరుమలేశ్వర చౌదరి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదాం..!



ప్రజాశక్తి-పాలసముద్రం: ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో విద్యావతి తెలిపారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో విద్యావతి మాట్లాడుతూ ప్రభుత్వం పర్యావరణానికి హాని కలిగించే పాలిథీన్, ప్లాస్టిక్ కవర్లను నిషేధించిందన్నారు. దుకాణాల్లో ఈనెల 25వ తేదీ పైగా ప్లాస్టిక్ కవర్లు వినియోగించరాదని.. రసీదులు ఇవ్వాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు మండల పరిధిలోని దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు నిషేధం చేయాలని.. అందుకే నోటీసులు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూడో క్రీడాకారులకు యూనిఫాం పంపిణీ



ప్రజాశక్తి-వెదురుకుప్పం: కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి జూడో ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా జూడో క్రీడాకారులకు బెంగళూరు ఫిలిప్స్ సీనియర్ ఐటీ మేనేజర్ ఆదినారాయణరావు శుక్రవారం యూనిఫాం అందించారు. తిరుపతిలోని జూడో సంఘం జెన్ అకాడమీలో శుక్రవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ బోర్డుమెంబర్ పోకల అశోక్‌కుమార్ హాజరయ్యారు. అధ్యక్షులు రాజేష్, ఉపాధ్యక్షులు భానుప్రకాష్ రెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డితో కలిసి వారి చేతుల మీదుగా క్రీడాకారులకు అందించారు.

స్వయం అభ్యాసంతోనే విద్యనభ్యసించాలి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: స్వయం అభ్యాసంతోనే విద్యను అభ్యసించాలని అగస్త్య ఫౌండేషన్ ఓఆర్‌వో జయమ్మ అన్నారు. శనివారం మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైన్సు పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ కోవిడ్ తర్వాత ఏర్పడిన విద్యా సంక్షోభం అధిగమించి విద్యార్థులకు విద్యాబోధన చేయాలని అగస్త్య ఫౌండేషన్ ద్వారా 6 నుంచి ఎనిమిది తరగతి చదువు పిల్లలకు విద్యను మెరుగు పరుచుకునేందుకు పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు అరుణ శివప్రసాద్, ప్రధానోపాధ్యాయులు లలిత, అగస్త్య ఫౌండేషన్ సిబ్బంది మోహన్, సత్యనారాయణ, మురళీ, అమరేంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు రమాదేవి, సంజీవి, పిల్లారప్ప, ప్రేమ కృష్ణ, ధనశేఖర్, భారతి, మోహన్ రెడ్డి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలి



ప్రజాశక్తి-నగరి: మండలంలోని గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య అన్నారు. శనివారం నగరిలో ఆ యూనియన్ సమావేశం దేశప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్ళినా పరిష్కారం కాలేదని, సంక్షేమం పథకాలను ప్రవేశపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని వాపోయారు. నగరి ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు జీతాలు జమకాలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. 5వ తేదీన ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నాకు ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్.రాజేంద్రన్, మండల నాయకులు సెల్వం, మణి, దండమ్మ, గోవిందమ్మ, జోసెఫ్, కుమారి, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి ఉత్సవాలు



ప్రజాశక్తి-పలమనేరు

పలమనేరులోని కొత్తపేట బసవన్నకట్ట వీధిలో బసవేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఘనంగా గీతా జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత ఎందుకు నేర్చుకోవాలి.. విశిష్ఠత గురించి వివరించారు. కార్యక్రమంలో తులసీనాథనాయుడు, ఎంపీడీవో బాలాజీ, విద్యాసాగర్, భాస్కర్ రంగనాథ్, వెంకటరమణ, ఎస్ఐ బాలాజీ, రాజశేఖర్, శ్రీకాంత్, రంజిత్, రమణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

చిత్తూరు ఎమ్మెల్సీ భరత్



ప్రజాశక్తి-రామకుప్పం: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శనివారం రామకుప్పంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రేషన్ కార్డులు, రెవెన్యూ సమస్యలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని.. మండలంలో ఉపాధి కూలీలకు బిల్లులు కల్పించాలని సూచించారు. బిల్లులు సక్రమంగా అందలేదని కూలీలు వలసలు పోకుండా నివారించే దిశగా చూడాలని కోరారు. పంచాయతీల్లో తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సిమెంట్ రోడ్లు అందాలని సిద్ధం చేసి వెంటనే అందించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. అర్హులందరికీ గృహ నిర్మాణాలకు సాయం అందించాలని పలువురు సభ్యులు కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, వైసీపీ మండలాధ్యక్షుడు బాబురెడ్డి, మండల కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచులు మురళీ, రాజగోపాల్, వాణి, అశోక్, నేత్రావతి, నాగిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జర్నుల్లా, వేసప్ప గౌడ, హేమ చలపతి, సురేంద్రరెడ్డి, ఎస్ఐ ఉమామహేశ్వర్ రెడ్డి, ఇన్‌ఛార్జి తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో ధారాకృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పుంగనూరు: రైతాంగానికి విద్యుత్ సమస్యలు లేని మండలంగా పుంగనూరు నిలుస్తోందని రూరల్ ట్రాన్స్‌కో ఏఈ ధనుంజయ అన్నారు. శనివారం పుంగనూరులోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. రైతులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తున్నామని.. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మన నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించడం అదృష్టమన్నారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యాశాఖలో ఊహించిన ప్రగతి తీసుకొచ్చారని.. నాడు-నేడులో రెండు విడతల్లో కోట్లు వెచ్చించి పాఠశాల భవనాలన్నీ ఆధునాతనంగా నిర్మించడం జరిగిందన్నారు. గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి రూ.4.70 కోట్లను మంజూరు మంజూరైనట్లు గ్రామీణ నీటి సరఫరా శాఖ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, తహసీల్దారు శివరామకృష్ణ, ఎంపీడీవో రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వెదురుకుప్పం వెలుగు కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెరుమాళ్ళపల్లె స్కైలైన్ రావాల్సిన నిధులను ఆదుకుంటున్నారని.. తన పరిధిలో అభివృద్ధి పనులు జరగడం లేదని ఎంపీటీసీ మురళిరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రావు, తహసీల్దారు పుల్లారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు కుమార్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యం నింపుదాం..!



ప్రజాశక్తి-కార్వేటినగరం: అంగ వైకల్యం మనిషికి మాత్రమేనని.. మనస్సుకు కాదని ఎంపీపీ లతా బాలాజీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో నిర్వహించిన జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవానికి ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వం భవిత కేంద్రాల నుంచి అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ అంగ వైకల్యం ఉన్న విద్యార్థులను మంచిగా భావంతో చూడాలని..వారిని ఆప్యాయంగా ఆదరించాలని తెలిపారు. ప్రత్యేక ప్రతిభావంతుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసినట్లయితే వారు ఎంతో ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. అనంతరం సహిత విద్య ఉపాధ్యాయులు సింధూజ మాట్లాడుతూ ఫిజియోథెరపీ ద్వారా విద్యార్థుల కోలుకుంటున్నారని, ప్రతిఒక్కరూ భవిత కేంద్రంలో చేయించే వ్యాయామాన్ని ఇంటి వద్ద తల్లిదండ్రులు చేయించడంతో త్వరగా కోలుకుంటారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు అవసరమయ్యే హియరింగ్ మిషన్లు, వీల్ చైర్లు పంపిణీ చేశారు. భవిత కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంపీపీ చేతుల మీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ధనంజయ, ఏఈ నాగభూషణం, ఉర్దూ పాఠశాల హెచ్ఎం షఫియా సర్వేగం, సహిత, ఉపాధ్యాయురాలు సింధూజ, పలువురు పాల్గొన్నారు.



పాలసముద్రం: ప్రభుత్వం భవిత పాఠశాలలో దివ్యాంగులకు ఉన్నవిధాల శిక్షణ అందించి వారి ఎదుగుదలకు సహాయ సహకారాలు అందిస్తోందని జడ్పీటీసీ సభ్యుడు అన్నులగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ అన్నారు. శనివారం పాలసముద్రం భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని సహిత విద్య ఉపాధ్యాయులు వసంత, బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పూర్ణాని, ఉపాధ్యాయులు కోదండయ్య, జమున, ప్రకాశం, వెంకటేష్‌లు, చంద్రశేఖర్, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సోమల: సోమలలోని భవిత కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వికలాంగులకు వీల్ చైర్లు, బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఉపాధ్యాయులు కుసుమాంబ, ఎల్లయ్య, ఎంఈవో కేశవశెట్టి, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గంగవరం హై స్కూల్ హెచ్ఎం పరశురామ్, స్పెషల్ ఎడ్యుకేటర్ అశోక్‌కుమార్, సహిత విద్య ఉపాధ్యాయులు సురేష్, సీఆర్పీలు చలపతి, గాయత్రి, కృష్ణకుమారి, రాజన్న, ప్రకాష్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు భవిత పాఠశాలలను ఉపయోగించుకోవాలని ఎంపీడీవో శ్రీధర్ అన్నారు. శనివారం జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని సహిత విద్య ఉపాధ్యాయులు హిమబిందు ఆధ్వర్యంలో బంగారుపాళ్యంలో నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలు భవిత పాఠశాలలో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదుగుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, సర్పంచ్ వాణి ప్రియ, ఎంపీటీసీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని జడ్పీటీసీ సుష్మ కీర్తి, మండల వైసీపీ కన్వీనర్ బాగారెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రపంచ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవాన్ని మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబురెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. ఎంఈవో హేమలత, వైస్ ఎంపీపీ బాబు, ఎంపీడీవో భాస్కర్, సర్పంచ్ అఖిల జాఫర్, ఎంపీటీసీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మల్లీశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నగరి: నగరి మున్సిపాలిటీ భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వికలాంగుల దినోత్సవాన్ని



శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి పిల్లలకు పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీదేవి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్.బాలన్, ఎంపీడీ భార్గవి, వైస్ ఎంపీపీలు వెంకట లక్ష్మీ, కన్వీనర్, ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం: ఎస్ఆర్ పురం ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని దివ్యాంగులకు వీల్‌ఛైర్లు, వినికిడి యంత్రాలను జడ్పీటీసీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ హరిత, కుప్పయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో వరప్రసాదరెడ్డి, ఉపాధ్యాయులు అరుణ, ప్రభుత్వ వర్త ప్రధానోపాధ్యాయులు మోహన్ కుమార్, బొజ్జయ్య, పద్మాపురం సర్పంచ్ భాస్కర్‌నాయుడు, సీఆర్పీలు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లిలోని భవిత కేంద్రంలో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పిల్లలకు పోటీలు నిర్వహించి ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప చేతుల మీదుగా బహుమతులు అందించారు. అనంతరం వికలాంగ పిల్లలకు అవసరమైన పరిమకరులను పంపిణీ చేశారు. ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, ఎంఈవో సుశీలా, సర్పంచులు, కేశవగౌడ, రామచంద్ర, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు ఎంఈవో లీలారాణి ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఎంసీవో అజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలను భవిత కేంద్రాలకు తప్పక హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, లోకేష్, యుగంధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేలుపల్లెలో 'ఇదేం ఖర్మ..మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బేలుపల్లిలో పట్నపల్లె కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం టీడీపీ నాయకులు పూజలు చేసి మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ..మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. బేలుపల్లి గ్రామ పంచాయతీలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని..తాను మంత్రిగా ఉన్న సమయంలో సంక్షేమంతో రూ.75 లక్షలు మంజూరు చేసినా వైసీపీ ప్రభుత్వం రాగానే పనులు మూలనపడ్డాయని వాపోయారు. మద్యాన్ని అధికధరలకు అమ్మడంతో పాటు నాటు పార్కులను పెట్టి రాష్ట్రానికి జె.బ్రాండ్స్ పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు.



కార్యక్రమంలో మండలం టీడీపీ నాయకులు కిషోర్‌గౌడ్, సుబ్రహ్మణ్యంశెట్టి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

రేపు సర్పంచులు, ఎంపీటీసీలకు శిక్షణ

ప్రజాశక్తి-కార్వేటినగరం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు అధికారులకు ఒక్క రోజు శిక్షణ ఉంటుందని ఎంపీడీవో మోహన మురళీ తెలిపారు. శనివారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో 5వ తేదీన ఉదయం 9 నుంచి 5.30 గంటల వరకు సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్య దర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- నగరి: నగరి సంత వద్ద శనివారం హెచ్ఐవీపై స్వేప్స్ సంస్థ ఆధ్వర్యంలో 2030 నాటికి హెచ్ఐవీ నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వేప్స్ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ ఆర్మగం మాట్లాడుతూ హెచ్ఐవీ అసాంఘిక శారీరక సంబంధాలు, వాడిన సిరంజిలు మళ్లీ వాడటం, గుర్తింపు లేని బ్లడ్ బ్యాంకుల రక్తమార్పిడి, తల్లికి హెచ్ఐవీ ఉంటే బిడ్డకు వచ్చే ప్రమాదాలు ఉన్నాయన్నారు. హెచ్ఐవీపై సందేహాలు ఉంటే 1097 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నాటక కళాబందం నాగరాజు, స్వేప్స్ సేవా సిబ్బంది కలైవాణి, ఏఎన్ఎం సుబ్బ



ఐందుమతి, మంజు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలు పక్క రాష్ట్రాలకుపోతున్నారు: నరసింహయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ యాదవ్

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ వైసీపీ ప్రభుత్వం తీరుతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు నిర్మించాలని వస్తున్నవారు పక్క రాష్ట్రాలకు తరలి పోతున్నారని మాజీ తుడా చైర్మన్ నరసింహ యాదవ్ విమర్శించారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి పరిసర ప్రాంతాలు నిరుద్యోగులకు ఎంతో బాసటగా ఉన్న అమరరాజా సంస్థ తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లాలో 9500 కోట్లతో నూతన యూనిట్ ను ప్రారంభిస్తోందన్నారు. ప్రస్తుతం పాలకులు ఎంత అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాయలసీమ ప్రాంతానికి ఏమాత్రం అభివృద్ధి చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఒక రాజధాని ఉన్న మూడు రాజధానులు ముద్దు అని నినదించడం వెనుక రాజకీయం ఉందని ఆరోపించారు. ప్రాజెక్టుల విషయంలో జగన్ ప్రభుత్వం ముందుకెళ్లలేదని, దీనిపై ఆగిపోయి ప్రాజెక్టుల వద్ద ఈ నెల 12 నుంచి టీడీపీ బృందాలు పర్యటించనున్నాయన్నారు. రాయలసీమ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయలసీమ రైతులకు సాగునీరు అందించేందుకు జగన్ ప్రభుత్వం పెండింగ్ ఉన్న ప్రాజెక్టుల పనులను పునరుద్ధరించడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సూరాసుధాకర్ రెడ్డి, ఎన్ బి సుధాకర్ రెడ్డి, దినబాబు, చెంగయ్య పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండలంలోని బుక్కాపట్నం వద్ద ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో డ్రైవర్ మతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బుక్కాపట్నం గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి కుమారుడు మోహన్‌రెడ్డి(49) కాలేపల్లెలో వారి బంధువులకు చెందిన ట్రాక్టర్‌ను అతని పొలం దున్నేందుకు బుక్కాపట్నానికి ట్రాక్టర్ తీసుకెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆవులను తప్పించబోయి ప్రమాదవశాత్తు పక్కనున్న పొలంలోకి దూసుకెళ్లి ట్రాక్టర్ బోల్తా పడింది. ప్రమాదంలో మోహన్‌రెడ్డి అక్కడికక్కడే మతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు పరిశీలించారు. మతదేహాన్ని బయటకు తీసి శవపరీక్ష నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి...



ప్రజాశక్తి - పూతలపట్టు: మండలంలోని పేట అగ్రహారం సమీపంలో శుక్ర వారం రాత్రి కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బంగారుపాళెం మండలం తుమ్మపాలెం పంచాయతీకి కచ్చటవారిపల్లి గ్రామానికి చెందిన మొగిలిఅప్ప (64) సొంత వారి పెళ్లి నిమిత్తం విజయవాడకు వెళుతుండగా పేట అగ్రహారం సమీపంలో బస్సులో చిన్నపాటి సాంకేతిక లోపంవల్ల ఆపడంతో సర్వీస్ రోడ్‌లో నుండి అటువైపు టీ షాప్‌కి వెళ్లే క్రమంలో కర్ణాటక రిజిస్ట్రేషన్ గల స్విఫ్ట్ డిజైర్ కారు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. బాడీని పోస్ట్‌మార్టం చేసి బంధువులకి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు



ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం: ఎస్ఆర్‌పురం మండలం శివగాంపురం సమీపంలోని అడవిలో శనివారం సాయంత్రం ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1.47 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షేక్షావలి తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జయహో బీసీ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పలమనేరు: 'జయహో బీసీ' కార్యక్రమాన్ని వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన విజయవాడలో నిర్వహించే మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే వెంకటే గౌడ పిలుపునిచ్చారు. శనివారం గంటావూరు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలమనేరు ఏఎంసీ చైర్మన్ హేమంత్ కుమార్‌రెడ్డి, మండి సుధా, ఎస్సీఎస్ జాఫర్, బీఆర్‌సీ కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదబిడ్డల తొలగింపుకు చర్యలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: పాతురినత్తం పంచాయతీ మిట్టకురపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం చుట్టూ గ్రామస్థులు పేద బిడ్డలు వేసుకోవడంతో ఇబ్బందికరంగా ఉందని అంగన్వాడీ కార్యకర్త అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ స్థలాన్ని పరిశీలించి దిబ్బలు వేసిన వారితో చర్చించారు. తొలగించేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వీఆర్వో గురువురెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆచారి, సూపర్‌వైజర్ శారద, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాడు- నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-సోమల

మండలంలోని పెద్దఉప్పరపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.96 లక్షలతో జరుగుతున్న నాడు-నేడు పనులను ఎంపీడీవో నాగరాజ శనివారం పరిశీలించారు. పనులను నాణ్యతతో త్వరగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ గణపతి, పాఠశాల కమిటీ చైర్మన్ ఇక్బాల్, పంచాయతీ కార్యదర్శి మనోహర బేగం పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రభుత్వం అండ

జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఆనంద్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి బైరాగి పట్టెడలోని భవిత మానసిక వికలాంగుల శిక్షణ కేంద్రంలో శనివారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.. ఈ



కార్యక్రమానికి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఆనంద్ రెడ్డి, మండల ఎంఈఓ ప్రభాకర్ రాజు, స్థానిక కార్పొరేటర్ శాలిని మహేష్ రెడ్డి, ఐఈడి కో-ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఉయ్ సపోర్ట్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు తహసీన్ బేగంలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మానసిక వికలాంగుల పిల్లలు కలిగిన తల్లిదండ్రులు ఆధైర్యపడకుండా ఉండాలని కోరారు. ఇలాంటి వారికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తున్నదని వాటిని అందిపుచ్చుకొని తమ పిల్లల సరైన శిక్షణ ఇప్పించాలని కోరారు.. స్థానిక కార్పొరేటర్ శాలిని మహేష్ రెడ్డి మాట్లాడుతూ మానసిక వికలాంగుల పిల్లలకు ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తున్నదని పేర్కొన్నారు.. ముఖ్యంగా ఇలాంటి పిల్లలందరికీ సరదగ సర్టిఫికెట్లను అందజేసి వారికి పెన్షన్ వచ్చే విధంగా చూస్తున్నామని చెప్పారు. అనంతరం ప్రభుత్వం తరఫున పిల్లలకి వీల్ చైర్లు, ఉయ్ సపోర్ట్ సంస్థ తరఫున టిఫిన్ బాక్స్ లు, అందజేశారు.. అనంతరం పిల్లలకు వారి తల్లిదండ్రులకు ఉయ్ సపోర్ట్ సంస్థ సభ్యులు తరఫున భోజనం అందజేశారు.